క్లుప్తంగా

ప్రత్యేక అవతారాల్లో జగన్నాథుడు



ఉల్లివీధి కాళ్లనాయుడు రామమందిరంలో ప్రత్యేక అవతారంలో జగన్నాథస్వామి

విజయనగరం టౌన్: వామన, పరశురాముల అవతారంలో జగన్నాథుడు భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. కోళ్లబజారులో కొలువైన జగన్నాథుడు వామన, పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నగేషాచార్యులు, వెంకటరమణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉల్లివీధి కాళ్లనాయుడు రామమందిరంలో కొలువైన బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వామిని అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ ఆచార్యులు వామన, పరశురామ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వేణుగోపాలస్వామి ఆలయ భూముల సర్వే



దేవస్థానం భూములను సర్వే చేస్తున్న అధికారులు

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ భూముల సర్వే బుధవారం జరిగింది. దేవస్థానం ఈఓ జగదీశ్వరి ఆధ్వర్యంలో సాగిన సర్వేలో దేవదాయశాఖ ఈఓలు పద్మావతి, ఎం.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



మన్మథరావును అభినందిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న ఎల్.మన్మథరావుకు ఎస్సైగా ఉద్యోగోన్నతి రావడంతో సీఐ బి.వెంకటరావు, సిబ్బంది బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ.. ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందిన మన్మథరావు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సైలు నరేష్, తారకేశ్వరరావు, నవీన్ పడాల్, హరిబాబునాయుడు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి అమానుషం

విజయనగరం అర్బన్: విశాఖపట్టణంలోని డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై తెలుగుదేశం విద్యార్థి సంఘ కార్యకర్తలు చేసిన దాడి అమానుషమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశంపై కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలకు నిరసనగా తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలు కొందరు విశాఖలోని డెక్కన్ క్రానికల్ పత్రికా కార్యాలయంపై రాళ్లు విసిరి, సంస్థ బోర్డును తగలబెట్టడం దారుణమని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కమిటీ సభ్యులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ



తహసీల్దార్ ప్రవల్లికప్రియకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పూసపాటిరేగ : అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ ప్రవల్లిక ప్రియకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం, సామాజిక భద్రతా పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎల్. శ్రీదేవి, పి.రాజేశ్వరి, జి.పార్వతి, సీహెచ్. సత్యవతి, బి.నర్సయ్యమ్మ, బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిరు తిండి.. రోగాలు దండి

● ఫాస్ట్‌ఫుడ్ పట్ల ఆకర్షితులవుతున్న విద్యార్థులు, యువత
● కొని తెచ్చుకుంటున్న అనారోగ్య సమస్యలు



రోడ్డుపై విక్రయించే పానీపూరి

విజయనగరం: రోజుకు రోజుకూ విస్తరిస్తున్న జిల్లా కేంద్రంలో వ్యాధులు కూడా అదే స్థాయిలో సోకుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమీపంలో బజ్జీలు, బోండాలు, పానీపూరి బండ్ల దుకాణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎక్కువ మంది పిల్లలు తల్లిదండ్రులు ఇచ్చిన నగదుతో వాటిని తింటున్నారు. దుకాణాల వారు పరిశుభ్రత పాటించకపోవడంతో అతిసార, వాంతులు, కడుపునొప్పి, ఆకలి మందగించడం, టైఫాయిడ్, కామెర్లు వంటి పలు రకాల రోగాల బారిన పడుతున్నారు. ఫలితంగా అనారోగ్యాలను కొని తెచ్చుకోవడంతో పాటు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఆరుబయట ఆహారం సరిగా లేక..

రోడ్ల పక్కన చిరుతిండ్లు విక్రయించే దుకాణాల్లో కనీసం మూతలు లేకపోవడంతో వాహనాల రాకపోకలతో రోడ్డు మీదున్న దుమ్ముధూళి పడి ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి. ఇలాంటి ఆహారాన్ని పిల్లలు, యువత ఎక్కువగా తిని అనారోగ్యం పాలవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాతారణం చల్లగా ఉండడం వల్ల గాలిలో బ్యాక్టీరియా ఎక్కువగా చేరుతుంది. పలు ప్రాంతాల్లో తాగునీటి పైపుల లీకేజీలతో నీరు కూడా కలుషితమవుతోంది. ఇటీవల ఎక్కువ మంది టైఫాయిడ్, కామెర్ల వ్యాధులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు సరిగా శుభ్రం చేయకపోవడం, వ్యర్థాలు తొలగించకపోవడం వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు. బజ్జీలు, చికెన్ పకోడ, గోబీ మంచూరియా లాంటి పదార్థాల్లో హానికరమైన రంగుల వేయడంతో అనారోగ్యం పాలవుతున్నారు.

అలవాట్లు బారిన పడకుండా...

చదువుకునే చిన్నారులు, యువత రోడ్లపై విక్రయించే చిరుతిళ్లకు దూరంగా ఉంచేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి. ముందుగా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. రోజువారీ ఇచ్చే పాకెట్ మనీని విద్యార్థులు అనారోగ్యం కొనితెచ్చే చిరుతిళ్లకు కేటాయిస్తున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తమై ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో కాలానుగుణమైన సీజనల్ వ్యాధులతో ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. జిల్లాలో అతిసార, టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ సమయంలో తాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. అలాగే రోడ్లపై దొరికే అనారోగ్యకమైన చిరుతిళ్లకు దూరంగా ఉండాలి.

– శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్యుడు

లైసెన్స్ జారీలో నిర్లక్ష్యం వద్దు

● కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఎటువంటి నిర్లక్ష్యం తగదని మున్సిపల్ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త వర్గీకరణ, అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్టాప్ డయేరియా గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేసి చైతన్యం కల్పించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు శాతం మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విధానం పకడ్బందీగా అమలు జరగాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి పాలిథిన్ ఉత్పత్తులు విక్రయిస్తే అపరాధ రుసుం విధించాలని సూచించారు.

విద్యార్థుల చేరికలపై ప్రత్యేక శ్రద్ధ

● డీఈఓ ప్రేమ్‌కుమార్



సమావేశంలో ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

భోగాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, పోలిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నిర్వాహణ, స్టూడెంట్స్ కిట్స్ పంపిణీపై ఆరా తీశారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రమౌళి, కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ డి. సూర్యనారాయణ, సీఆర్‌సీ కనకరాజు పాల్గొన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై విచారణ



లోకాయుక్త ఫిర్యాదుపై విచారిస్తున్న పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

పూసపాటిరేగ: మండలంలోని గుంపాం గ్రామ పంచాయతీలో అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన ఇనగంటి రాకేష్‌శర్మ ఇటీవల లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుపై బుధవారం విచారణ జరిగింది. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు గుంపాం సచివాలయంలో విచారణ చేశారు. రేఖా నంబర్ 455లో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని.. 2017 నుంచి 2024 వరకు పంచాయతీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుపై కార్యదర్శి గాయత్రి వివరణ ఇచ్చారు. ఖర్చు చేసిన ప్రతి పైసాకు ఓచర్, ఎంబుక్‌తో సహా అన్నీ ఉన్నాయని తెలిపారు. సర్పంచ్ ఎర్ల ఆదిలక్ష్మి సంతకాలు ఫోర్జరీ జరిగాయని ఫిర్యాదులో తెలియజేయగా..ఆ సంతకాలు తాను చేసినవేనని సర్పంచ్ వివరణ ఇచ్చారు. గ్రామానికి చెందిన వేజెర్ల సావిత్రి పేరిట జిరాయితీ భూమిని గ్రామకంతం భూమిగా చూపించి ధ్రువీకరణ పత్రంను కార్యదర్శి గాయత్రి మంజూరు చేశారని ఫిర్యాదు రాగా పంచాయతీ అధికారి విచారణ పూర్తి చేశారు. ఫిర్యాదుదారు, కార్యదర్శి, సర్పంచ్ వివరణలతో కూడిన నివేదికను లోకాయుక్తకు సమర్పిస్తామని పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సర్దుకుపోవాలి..

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

పూసపాటిరేగ : ఇది టీడీపీ ప్రభుత్వం కాదు.. కూటమి ప్రభుత్వం.. ఎన్ని కష్టనష్టాలున్నా సర్దుకుపోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. మండలంలోని చల్లవానితోట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామినాయుడు స్వగ్రహంలో కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో కలిసికట్టుగా ఉండాలని, ఎటువంటి పొరపచ్చాలున్నా సర్దుకుపోవాలన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి ఒంటెద్దుపోకడలతో ఇబ్బంది పడుతున్నామని పలువురు కార్యకర్తలు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. జనసేన కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలకు లబ్ధిదారుల పేర్లను పంపి టీడీపీ కార్యకర్తలను చులకనగా చూస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ నాయకులు మహంతి చిన్నంనాయుడు, మహంతి శంకరరావు, పతివాడ తమ్మునాయుడు, ఆకిరి ప్రసాదరావు, పసుపులేటి గోపి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ నిరసన



డెంకాడ: మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు



నెల్లిమర్ల: ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగులు

డెంకాడ: సమగ్ర శిక్షాభియాన్‌లో పని చేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మండల విద్యావనరుల కేంద్రం వద్ద బుధవారం నిరసన తెలియజేశారు. ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రతినెలా సమయానికి వేతనాలు వచ్చే విధంగా ముందస్తు బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. గతంలో సమ్మె సమయంలో జరిగిన అగ్రిమెంట్‌పై ఎలాంటి ముందడుగు వేయలేదని, సమ్మె కాలానికి జీతం చెల్లించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు అగ్రిమెంట్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలకు ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. విడుదల కానున్న ఉపాధ్యాయ డీఎస్సీలో అర్హత కలిగిన ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద..

విజయనగరం ఫోర్ట్: పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) నాయకుడు బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు , డీసీహెచ్ఎస్ గౌరీశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా అశోక్ మాట్లాడుతూ, ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, సూపర్ వైజర్లకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. అదేవిధంగా పీఎఫ్ బకాయి సొమ్ము కడా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంగారునాయుడు, లక్ష్మి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎ. రామకృష్ణ, ఎన్.భారతి, బి. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ తెలిపారు. బుధవారం స్థానిక బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులు సకాలంలో వైద్య తనిఖీలు నిర్వహించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిపించుకోవడం తల్లీబిడ్డలకు మంచిదని చెప్పారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సామాజిక సేవలో యువతను భాగస్వామ్యం చేయాలి

● రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నగేష్



క్లబ్‌లో చేరిన వారికి స్వాగతం పలుకుతున్న రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నగేష్

విజయనగరం: సామాజిక సేవలో యువతను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేయాలని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కేపీ నగేష్ సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం జరిగిన రోటరీ సెంట్రల్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన వారికి రోటరీ పిన్నులు తొడిగి సంస్థలోకి ఆహ్వానించారు. కొత్తగా ఎన్నికైన వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో రోటరీక్లబ్ రక్తనిధి కేంద్రం, స్వర్గధామం, తదితర శాశ్వత ప్రాజెక్ట్‌లను నెలకొల్పడం గొప్ప విషయమన్నారు. సమాజానికి అత్యంత అవశ్యకమైన పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ఏడాది పొడవునా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రోటరీ సెంట్రల్ క్లబ్ ప్రతినిధులు సమకూర్చిన ఆర్థిక సహాయం చెక్కును పట్టణంలోని చెవిటి, మూగ పిల్లల పాఠశాల ప్రిన్సిపాల్‌కి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్. శంకర్‌రెడ్డి, గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఉమాబాలాజీ, ప్రతినిధులు జయకృష్ణ, అరుణ్‌కుమార్ సొధాని, వీవీ రాజేష్, శివకుమార్, టీఎల్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా జిల్లాకు వస్తున్న నారా చంద్రబాబునాయుడు పర్యటనను నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు భోగాపురం విమానాశ్రయం పనులను పరిశీలించేందుకు గురువారం వస్తున్న సందర్భంగా బుధవారం స్థానిక అశోక్ బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిని పట్టించుకోలేదని, అనేక ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిందని ఆరోపించారు. ఉత్తరాంధ్రలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు కర్రోతు బంగార్రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర



జగన్నాథస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో జగన్నాథస్వామి రథయాత్ర బుధవారం అత్యంత వైభవంగా కొనసాగింది. ఆలయం నుంచి రామతీర్థం దేవాలయం వరకు జగన్నాథస్వామి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రామతీర్థం దేవస్థాన అర్చకులు స్వామికి పట్టువస్త్రాలు, పూల దండలు సమర్పించారు. అనంతరం రామతీర్థం గ్రామంలో జగన్నాథుడి రథయాత్ర శోభాయమానంగా సాగింది. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల అనుకూల విధానాలు మానుకోవాలి

● సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రామారావు



హమాలీలకు అవగాహన కల్పిస్తున్న రామారావు

నెల్లిమర్ల : ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల అనకూల విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద విద్యుత్ హమాలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడంతో పాటు కార్మిక నల్ల చట్టాలను తీసుకు వచ్చి కార్మికులు, ఉద్యోగులను రోడ్డున పడేసిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల్లో కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల రాయితీ కల్పించి, కార్మికుల నోట్లో మట్టి కొంటిందన్నారు. వెంటనే బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయడంతో పాటు కార్మికులకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో విద్యుత్ హమాలీ సంఘ నాయకులు కెల్ల గోవిందరావు, పతివాడ లక్ష్మణరావు, మీసాల లెనిన్, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, కలిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం..

విజయనగరం పూల్‌బాగ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల పథకాల్లో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎ. జగన్‌మోహనరావు, బి. రమణ, వి.రాములు, యూఎస్ రవికుమార్, బి. సుధారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఓ అనితకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే జులై 1 నుంచి నూతన చట్టాలు ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిందని.. వీటి వల్ల కార్మికులకు తీవ్ర నష్టం చేకూరుతుందని చెప్పారు. వెంటనే చట్టాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీఎస్ఎన్ రాజు, రాఘవ, ఎస్. రాజు, కుమార్, మధు, వై. రామారావు, ప్రసన్న, ఆనంద్, సత్యనారాయణ, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే నిర్ణయం

● టోల్‌గేట్ ఏర్పాటుపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: నేషనల్ హైవే 26పై జొన్నాడ వద్ద నిర్మాణంలో నున్న టోల్‌గేట్ ఏర్పాటుపై ప్రజాభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం కలిసి టోల్‌గేట్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టోల్‌గేట్‌ను చాలామంది వ్యతిరేకిస్తున్నా, ప్రజాభీష్టం మేరకు వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, ఆర్డీఓ సూర్యకళ, జాతీయ రహదారుల పీడీ ప్రభాత్‌రంజన్, ఈఈ శ్రీనివాసులు, తహసీల్దార్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.